క్లుప్తంగా

శాకంబరిగా కనకమహాలక్ష్మి



కూరగాయల అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి: ఆషాడ శుద్ధ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు ఆదివారం శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తు లు సమర్పించిన వివిధ రకాల కూరగాయలను ఆలయ అర్చకులు అమ్మవారికి అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అంబటివలస సర్పంచ్ మృతి



కసవయ్య (ఫైల్)

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామ సర్పంచ్ సిరిపురపు కసవయ్య కొద్ది నెలలుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో మృతి చెందారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యతో పాటు ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభూజీరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బోద్దల చిన్నంనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు తాళ్లపూడి అప్పలనాయుడు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు సంతాపం తెలియజేశారు.

వాహనాల తనిఖీ



వాహన తనిఖీలు చేపడుతున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం జంక్షన్ వద్ద బుధరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పలువురు వాహనదారులపై అపరాధ రుసుం విధించారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కేసులు తప్పవని హెచ్చరించారు.

గుంతలు పూడ్చివేత



రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న దృశ్యం

వేపాడ: మండలంలో సోంపురం–వేపాడ రహదారిలో ఏర్పడిన గుంతలను స్థానిక సర్పంచ్ మురిపిండి గంగరాజు చొరవతో స్థానికులు తాత్కాలికంగా పూడ్చివేశారు. అరిగిపాలెం, సోంపురం జంట గ్రామాల మధ్య రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడటంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై స్పందించిన సర్పంచ్ గంగరాజు మట్టిని తెప్పించి గోతులను పూడ్చారు. అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

రహదారి బాగుచేయండి



రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో చేరిన నీరు

గంట్యాడ: మండలంలోని బుడతానపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొఠారుబిల్లి జంక్షన్ నుంచి బుడతానపల్లి గ్రామానికి సుమారు 7 కిలో మీటర్లు దూరం ఉంటుంది. దారి పొడవునా గుంతలు ఏర్పడటంతో ఈ రోడ్డులో ప్రయాణం చేసేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



జామి: జామిలో షిర్డీసాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆషాఢ శుద్ధ పౌర్ణమి, వ్యాస భగవానుడి జన్మదినం సందర్భంగా ఆదివారం వాడవాడలా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు షిర్డీసాయిబాబా ఆలయాలు చేరుకుని అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులతో బాబా ఆలయాలు కిటకిటలాడాయి. మధ్యాహ్నం పలు ఆలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం గ్రామవీధుల్లో సాయినాథున్ని పల్లకిలో ఊరేగించారు.

– సాక్షి నెట్‌వర్క్



గజపతినగరం: ఎం.వెంకటాపురంలో సాయినాథునికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



వేపాడ: వేపాడలో సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొత్తవలస: రైల్వే కాలనీలో ఉన్న సత్యసాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



లక్కవరపుకోట మండలం గొల్జాం షిర్డీసాయి ఆలయం పూజలు



శృంగవరపుకోట: దత్తసాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తవలస: తుమ్మికాపల్లి గేటు సమీపంలో షిర్డీసాయిరాం ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఎస్.కోట: పట్టణంలో మహావతార్ బాబాజీ ఊరేగింపులో భక్తులు



మెరకముడిదాం: సోమలింగాపురం శేషసాయి బాబాకు పాలాభిషేకం చేస్తున్న ధర్మకర్త ఎస్‌వీ రమణరాజు కుటుంబ సభ్యులు



బొండపల్లి: దేవుపల్లిలో షిర్డీసాయి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త ఆదుర్తి రమకృష్ణ, విజయలక్ష్మి దంపతులు



శృంగవరపుకోట: సాయినాథుని పల్లకి సేవలో అలరించిన మహిళల కోలాటం

ఊపందుకున్న ఉబాలు



జగ్గయ్యపేటలో పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు

వేపాడ: వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, సాగునీటి కాలువల్లో నీరు చేరడంతో రైతులు ఖరీఫ్ వరినాట్లు వేసేందుకు సన్నద్ధమయ్యారు. పొలాలను దమ్ము చేసి నాట్లు వేసేందుకు సిద్ధం చేస్తుండగా.. ఇప్పటికే దమ్ములు పూర్తయిన పొలాల్లో నాట్లు వేస్తున్నారు. కాగా సాగునీటి అందుబాటులో లేని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే వరి వెదలు వేసుకున్నారు. వర్షాలు లేక ఎండిపోతున్న వెదపొలాలకు ఇటీవల కురిసిన వర్షాలు ఊపిరిపోయడంతో రైతుల ఆశలు చిగురించాయి. మరో వైపు సాగు పెట్టుబడి పెరిగిపోతుండడంతో వేపాడ, వల్లంపూడి, వీలుపర్తి, వావిలపాడు, వెల్దాం, నీలకంఠరాజపురం, దబ్బిరాజుపేట తదితర గ్రామాల రైతులు సరుగుడు, నీలగిరి తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు గడువు పెంపు

గజపతినగరం: డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈ నెల 25 వరకు పొడిగించిందని గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు ఈ నెల 20తో ముగిసిందని, విద్యార్థుల వినతుల మేరకు ప్రభుత్వం ఈ నెల 25 వరకు గడువు పొడిగించిందన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ కంప్యూటర్స్, తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఎర్రిగెడ్డ ఆక్రమణపై నివేదిక ఇవ్వండి

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలో ఎర్రిగెడ్డ ఆక్రమణపై జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సీరియస్ అయ్యారు. తక్షణమే ఆక్రమణలు అడ్డుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కర్లాం గ్రామంలోని ఎర్రిగెడ్డ ఆక్రమణపై 'ఎర్రిగెడ్డ 'రామా'ర్పణం' అనే శీర్షికతో ఆదివారం సాక్షి పత్రికలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఆక్రమణపై పూర్తిస్థాయి నివేదిక అందించాలని జేసీ కార్యాలయం నుంచి చీపురుపల్లి ఆర్డీఓ బి.శాంతికి, తహసీల్దార్ ఎన్.ప్రసాద్‌కు ఆదేశాలు అందాయి.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ఈ వేదిక అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలని కోరారు.

గురువులను పూజించాలి



వ్యాసమహర్షి చిత్రపటానికి పూలమాల వేసి పూజిస్తున్న రమణ, విద్యార్థులు

చీపురుపల్లి: విద్య నేర్పిన గురువులను జీవితకాలం పూజిస్తూనే ఉండాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని జి.అగ్రహారం ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి వ్యాసమహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజించారు. అనంతరం గురువు గొప్పతనాన్ని, గురుపౌర్ణమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. సనాతన హైందవ ధర్మంలో తల్లిదండ్రులు తరువాత గురువుకు స్థానం దక్కిందన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది గురువేనని, ప్రతీ ఒక్కరి జీవితంలో గురువు కీలకపాత్ర పోషిస్తారన్నారు. అందుకనే మనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించాలన్నారు.

ఎమ్మెల్యేకు జూట్‌మిల్లు కార్మికుల వినతి



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న జూట్‌మిల్లు జేఏసీ నాయకులు

లక్కవరపుకోట: కొత్తవలస మండలం సీతంపేట గ్రామం సమీపంలో ఉన్న ఉమా జూట్‌మిల్లు అక్రమ లాకౌట్‌ను తక్షణమే ఎత్తేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని ఆదివారం ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జూట్ ధర పెరిగిపోవడం, ఉత్పత్తి తగ్గిపోవడంతో నష్టాలు వస్తున్నాయని చెప్పి ఈ నెల 15న కంపెనీ యాజమాన్యం లాకౌట్ ప్రకటించిందని, దీంతో కంపెనీలో పనిచేస్తున్న సుమారు 400 మంది కార్మికులు కుటుంబాలతో వీధిన పడ్డారని ఎమ్మెల్యే వద్ద వాపోయారు. కర్మాగారాన్ని తెరిపించేందుకు కృషి చేయాలని ఆమెను అభ్యర్థించారు.

కాలువ ఇలా.. సాగునీరు అందేదెలా?



కోమటిపల్లి వద్ద రాణి సర్కార్ కాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

దత్తిరాజేరు: ఏడొంపుల గెడ్డ నుంచి వింద్యవాసి గ్రామ చెరువుకు సాగునీరు తరలించే రాణిసర్కార్ కాలువ పిచ్చిమొక్కలుతో నిండిపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీటి కష్టాలు తప్పేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువలు ఇలా ఉంటే సాగునీరు ఎలా వస్తుందని వాపోతున్నారు. మండలంలోని వింద్యవాసి చెరువుకు మెంటాడ మండలం కుంటినవలస వద్ద ఉన్న ఏడొంపుల గెడ్డ నుంచి నీరు వస్తుంది. ఈ చెరువు పూర్తిగా నిండాక ఇక్కడ నుంచి గుచ్చిమి, వంగర, చుక్కపేట గ్రామాల చెరువులకు నీరు అందుతుంది. రాణిసర్కార్ కాలువ మొత్తం పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్‌కు నీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి కాలువలో పూడికలు తొలగించాలని, సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కరువు..

- చెలరేగిపోతున్న కబ్జాదారులు
- అనుమతుల్లేకుండా కాలువలపై దుకాణాల ఏర్పాటు
- కార్పొరేషన్ స్థలాన్ని పశువులకు ఆవాసంగా వినియోగించుకుంటున్న వైనం
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



దాసన్నపేట వాటర్ ట్యాంక్‌ను ఆనుకుని ఏర్పాటైన దుకాణాలు

విజయనగరం: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కరువైంది. స్థానిక నాయకుల అండదండలతో పలువురు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నగరంలోని దాసన్నపేట ప్రాంతంలో.. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. కొందరు ఉపాధి పేరిట దుకాణాలు ఏర్పాటు చేసుకుంటుండగా... మరి కొందరు పశువులకు ఆవాసాలుగా మార్చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కార్పొరేషన్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దాసన్నపేట ప్రాంతంలో గల వాటర్ ట్యాంక్ చుట్టుపక్కల పరిసరాలను స్థానికులు తమ సొంత స్థలాలుగా మార్చేసుకుంటున్నారు. ఉపాధి పేరిట ప్రధాన కాలువపై శ్లాబ్‌లు వేసి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాస్తవానికి గతంలో టీడీపీ హయాంలో ఇదే ప్రాంతంలో స్థానికుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు ప్రారంభించి అనంతరం చేతులెత్తేశారు అప్పటి నాయకులు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ ప్రాంతంలో వాటర్‌ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసింది. ఇదేక్రమంలో వాటర్‌ట్యాంక్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఎన్నికలు సమీపించడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా... పలువురు వాటర్‌ట్యాంక్‌ను ఆనుకుని ఉన్న కాలువను ఆక్రమించుకుని తమ సొంత ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాటర్ ట్యాంక్ పరిసరాలు పరాయివారి అధీనంలోకి వెళ్లిపోవడం ఖాయమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా దాసన్నపేట వాటర్‌ట్యాంక్ జంక్షన్ నుంచి సింగపూర్ సిటీ వెళ్లే మార్గంలో కార్పొరేషన్ చెందిన స్థలాన్ని మరొకరు ఆక్రమించుకుని పశువులకు ఆవాసంగా వినియోగించుకోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఆ ప్రాంతంలో కార్పొరేషన్ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని తొలగించి స్వప్రయోజనాల కోసం వినియోగించుకోవడాన్ని స్థానికులు తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దాసన్నపేట ప్రాంతంలో జరుగుతున్న ఆక్రమణలను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు.



సింగపూర్ సిటీకి వెళ్లే మార్గంలో కార్పొరేషన్ స్థలాన్ని పశువులకు ఆవాసంగా వినియోగించుకుంటున్న దృశ్యం

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు..

కార్పొరేషన్ పరిధిలో ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. దాసన్నపేట ప్రాంతంలో ఆక్రమణలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. ప్రభుత్వ స్థలాల్లో పాగా వేయాలనుకోవడం చట్టరిత్యా నేరం. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. – ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

యోగాతో ఆరోగ్యం



యోగా గురువును సన్మానిస్తున్న ప్రసాదరావు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: యోగాతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు అన్నారు. సొసైటీ కార్యాలయంలో ప్రముఖ యోగాగురువు సుందరశివరాను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుందరరావు తొమ్మిది సంవత్సరాలుగా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఉదయం 5 గంటల నుంచి 7 వరకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. యోగా చేయడం వల్ల బీపీ, సుగర్, సయాటికా, నడుం నొప్పి వంటివి నయం అవుతాయని తెలిపారు. ప్రాణాయామం ఆసనాలు, ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు.

కబేళాలు ఎత్తివేయాలి

విజయనగరం ఫోర్ట్: పశువుల కబేళాలను ఎత్తివేయాలని గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక గో సంరక్షణ సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి అనుమతుల్లేకుండా పశువులను చంపి, కంటైనర్ల ద్వారా వాటి మాంసాన్ని ఎగుమతి చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఆర్ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు మద్దెల సోంబాబు, రామరాజ్యం, మజ్జి రామారావు, గండికోటి శాంతి, తదితరులు పాల్గొన్నారు.